క్లుప్తంగా

కౌలు రైతు గ్రామ సభలు

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని అన్ని గ్రామాల్లో కౌలు రైతులను గుర్తించి వారికి గ్రామసభల ద్వారా కౌలు రైతు భూమి హక్కు పత్రాలను పంపిణీ చేస్తామని ఏవో శ్రీనివాసరావు పేర్కొన్నారు. నేటి నుంచి ఈనెల 21వ తేదీ వరకు ఈ ఖరీఫ్ కాలంలో సాగు హక్కు పత్రాలను రెవెన్యూ, వ్యవసాయ శాఖ ద్వారా మంజూరు చేస్తామని తెలిపారు. ఈకార్డుల కాలపరిమితి ఈ రబీకాలం వరకు 11 మాసాల పాటు వ్యాలిడిటీలో ఉంటుందన్నారు. గ్రామ సభలు నిర్వహించే సమయంలో పొలం పాస్‌బుక్, ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌పుస్తకం జిరాక్స్‌లను తీసుకురావాలని కోరారు.

పంచముఖ ఆంజనేయునికి ప్రత్యేక పూజలు

అద్దంకి: పట్టణం నుంచి వేలమూరిపాడు వెళ్లే రహదారిలోని పంచ ముఖ ఆంజనేయ స్వామికి మంగళవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజల్లో రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో మలాది శ్రీనివాసరావు దంపతులు మొక్కలు నాటారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, దేవపాలన, చుండూరి మురళీ సుధాకర్‌రావు, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, గాడేపల్లి దివాకరదత్తు, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, రోటరీస భ్యులు పాల్గొన్నారు.

వేసవి తరగతులతో విజ్ఞానం



కారంచేడులో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

కారంచేడు: వేసవి కాలంలో విద్యార్థులు ఖాళీ సమయంలో గ్రంథాలయాలకు వచ్చి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని గ్రంథ పాలకుడు వి. నాగయ్య అన్నారు. సోమవారం వివిధ రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచామన్నారు. సెల్‌ఫోన్‌తో ఆటలు, రీల్స్ చూసుకోకుండా పుస్తకాలు చదవడం వలన మంచి జ్ఞానాన్ని సంపాదించవచ్చన్నారు. ఆటలు, పాటలు, చదవడం, రాయడంతో పాటు, కథలు చెప్పడం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.

విద్యుత్ డీఈఈగా శ్రీనివాసులు

పర్చూరు(చినగంజాం): పర్చూరు విద్యుత్ శాఖ డీఈఈగా జె. శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీఈఈగా పనిచేసిన రమేష్ బదిలీపై వెళ్లడంతో ప్రభుత్వం శ్రీనివాసులును నియమించింది. ఈయన వేటపాలెం డీఈఈగా పనిచేస్తూ బదిలీపై పర్చూరు వచ్చారు. ఆయనకు పర్చూరు ఏఈ రమేష్ నాయక్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

వేదిక్ మ్యాథ్స్‌తో ప్రయోజనం

చినగంజాం: వేదిక్ మ్యాథ్స్‌తో విద్యార్థులకు ఎంతో ప్రయోజనం ఉందని చీరాల శాఖ ఎల్ఐసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ జి. శ్రీరామచంద్రమూర్తి అన్నారు. శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో సోమవారం హాజరయ్యారు. ముందుగా రిసోర్స్ పర్సన్ వై. రామాంజనేయులు విద్యార్థులకు యోగా శిక్షణ నిర్వహించి.. ఆసనాలు వేయించారు. ఎల్ఐసీ డీఓ శ్రీరామచంద్రమూర్తి వేదిక్ మ్యాథ్స్ ద్వారా టేబుల్స్ షార్ట్ కట్‌లో ఉపయోగించే విధానం, పెద్ద సంఖ్యల హెచ్చవేతల విధానాన్ని వివరించారు. గ్రంథ పాలకుడు అళహరి మోహన లక్ష్మీనరసింహాచార్యులు, ఆర్. పోతురాజు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించుకోండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసమూర్తి

చినగంజాం: దివ్యాంగులు తమ సమస్యలను గ్రూపులను ఏర్పాటు చేసుకొని వారే స్వయంగా పరిష్కారం చేసుకోవాలని ఎంపీడీఓ ఏ. శ్రీనివాస మూర్తి అన్నారు. మండలంలోని దివ్యాంగుల సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం మండల సమాఖ్య సమావేశ భవనంలో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీఓ మాట్లాడుతూ దివ్యాంగులు గ్రూపులుగా ఏర్పాటై సమస్యలను సమాఖ్య సమావేశంలో తీర్చుకునే విధంగా తయారు కావాలన్నారు. ప్రభుత్వం నుంచి అందే ప్రయోజనాలను స్వయంగా గ్రూపులు కార్యాలయానికి వచ్చి పొందేందుకు సిద్ధం కావాలన్నారు. తాను కార్యాలయంలో అందుబాటులో ఉంటానని వారికి హామీ ఇచ్చారు. పెదగంజాం శ్రీరామ గ్రూపు రూ. 2 లక్షలను శ్రీ నిధి నుంచి మాచవరం పరంజ్యోతికి నడుకు బెల్టును అందజేశారు. ఏపీఎం పెద సుబ్బారావు, చినగంజాం గ్రామ ఉప సర్పంచ్ చెరుకూరి రాఘవయ్య, మండల సమాఖ్య అధ్యక్షురాలు విశ్రాంతమ్మ, వేణు, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

మంటల మండే



ఎండల తీవ్రతకు నిర్మానుష్యంగా ఉన్న కారంచేడు



వేటపాలెంలో ఎండల తీవ్రతతో జనసంచారం లేక నిర్మానుష్యంగా ఉన్న సెంటర్

- మూడు నియోజకవర్గాల్లో 38–41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న వృద్ధులు, చిన్నారులు
- జాగ్రత్తలు లేకుంటే ప్రాణాపాయం తప్పదు

జిల్లాలో నమోదు అయిన ఉష్ణోగ్రతలు

అద్దంకి	41 డిగ్రీలు
పర్చూరు	40 డిగ్రీలు
బాపట్ల	38 డిగ్రీలు
చీరాల	38 డిగ్రీలు

కారంచేడు: వేసవి ఉష్ణోగ్రతలు ఠారెత్తిస్తున్నాయి. బయటకు వెళ్లాలంటే జనం హడలిపోతున్నారు. జిల్లాలోని అద్దంకి, పర్చూరు, రేపల్లె, వేమూరు నియోజకవర్గాలతో పాటు సముద్ర తీర ప్రాంతాలైన చీరాల, బాపట్ల నియోజకవర్గాల్లోని పలు గ్రామాలు ఎండల తీవ్రతకు అల్లాడిపోతున్నారు. వృద్ధులు, చిన్నారులు అవస్థలు పడుతున్నారు. అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని, లేకుండా ప్రాణాపాయం తప్పదు. వడదెబ్బతో పాటు జీర్ణకోశ వ్యాధులు, అధిక వాంతులు, అధిక విరేచనాలు, డీహైడ్రేషన్, చర్మ వ్యాధులు, జ్వరాలు ఎక్కువగా వ్యాపించే అవకాశం ఉంది. సోమవారం జిల్లాలోని అనేక ప్రాంతాల్లో 38-41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

వేసవికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

అత్యవసరమైతే తప్పితే బయటకు రాకూడదు. ఒకవేళ వస్తే తలకు టోపీ, గొడుగు, కళ్ళకు నల్ల కళ్లద్దాలు వాడాలి. కాటన్, మెత్తని దుస్తులు ధరించాలి. మంచినీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ నీరు, నిమ్మరసం వంటి ద్రవ పదార్థాలు తీసుకెళ్లాలి. గర్భిణులు, వృద్ధులు, చిన్నబిడ్డలు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు బయటకు వెళ్లకూడదు. ఫ్రిజ్‌లో చల్లని నీటిని తాగకూడదు. ఒకవేళ వడదెబ్బ తగిలితే వారిని మంచి గాలి, వెలుతురు, నీడ ఉండే ప్రాంతాల్లో ఉంచాలి. చల్లటి తడి బట్టలతో తుడుస్తూ ఉండాలి. ఓఆర్ఎస్ ప్యాకెట్‌లను పట్టించాలి. వీలైనంత త్వరగా సమీపంలోని ఆసుపత్రికి తరలించాలి.

రోహిణీ కార్తె రాకముందే..

వేటపాలెం: ఈ నెల 25వ తేదీ నుంచి రోహిణి రానుండగా.. ముందుగానే ఎండల తీవ్రత పెరగడంతో ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. వాతావరణ శాఖ రాబోవు నాలుగు రోజులు ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని ప్రకటించారు. వడగాడ్పులు వీస్తాయని ప్రకటించారు. వేటపాలెం గడియార స్తంభం సెంటర్, ప్రధాన సెంటర్, రైల్వే స్టేషన్ రోడ్డు, వన్‌వేరోడ్డు, లైబ్రరీ రోడ్డు, మైన్ రోడ్డు జన సంచారం లేక కర్ఫ్యూ వాతావరణం కనిపించింది. దుకాణాణాలు మూసివేశారు.

శీతల పానీయాల వ్యాపారం డీలా..

వేసవి కాలంలో ప్రజలు ఎండ నుంచి ఉపశమనం కావడానికి శీతల పానీయాలు ఎక్కువగా ఇష్టపడతారు. అందుకు తగ్గట్లు ప్రధాన వీధుల్లో కూల్‌డ్రింక్స్, జూస్ షాపులు ఎక్కువగా వెలిశారు. అయితే ఈ వ్యాపారాలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే దుకాణాలు తెరిచి ఉంచాల్సి వస్తోంది. ఉష్ణోగ్రత్తలు పెరిగిపోతున్న నేపథ్యంలో వడగాల్పులు పెరిగే అవకాశాలు కూడా అధికంగానే ఉంటాయి. ఈ కారణంగా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల సమయంలో బయట తిరగడం మంచిది కాదు. చమట వల్ల శరీరం డీహైడ్రేషన్‌కి గురికా కుండా తరచూ నీరు, గ్లూకోజ్ వాటర్, బార్లీ నీరు తాగుతుండాలి.

ఎండ తీవ్రతను బట్టి జాగ్రత్తలు అవసరం



వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు ఎంత ఎక్కువగా ఉన్నప్పటికీ తగిన జాగ్రత్తలు తప్పకుండా పాటించాలి. నిర్లక్ష్యంగా ఉంటే చాలా ఇబ్బందులు వస్తాయి. ఎండల తీవ్రతను బట్టి చర్మ వ్యాధులు వ్యాపిస్తాయి. దీర్ఘకాలిక వ్యాధులున్న వారు, గుండె జబ్బులున్న వారు మరింత జాగ్రత్తలు తీసుకోవాలి. వేసవిలో ఎక్కువగా వచ్చే చికెన్‌పాక్స్ విషయంలో మూఢ నమ్మకాలను పాటించవద్దు.

– డాక్టర్ గోరంట్ల సురేష్‌బాబు,
వైద్యాధికారి, కారంచేడు

అదుపు తప్పిన కారు.. ముగ్గురికి గాయాలు



అదుపు తప్పి రోడ్డు మార్జిన్ గోతిలో పడిపోయిన కారు

చినగంజాం: నిద్రమత్తులో కారు అదుపు తప్పడంతో ముగ్గురు గాయాలపాలైన సంఘటన చినగంజాం జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. నెల్లూరు జిల్లా కావలి మండలం జువలదిన్నె గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ఉదయాన్నే బయులదేరి నిజాంపట్నం వెళుతున్నారు. చినగంజాం జాతీయ రహదారిపై కడవకుదురు వద్ద ఎంత్రీ హోటల్ సమీపానికి రాగానే డ్రైవింగ్ చేస్తున్న పోలయ్యకు నిద్రమత్తు ఆవరించడంతో కారు అదుపుతప్పి రోడ్డు మార్జిన్‌లోకి దూసుకుపోయింది. ఆ సమయంలో కారు నుజ్జునుజ్జు కాగా అదృవశాత్తు పోలయ్య డ్రైవర్‌కు అందులో ప్రయాణిస్తున్న పీ శ్రీనివాసులు, కె. కొండల రాజులకు స్వల్పగాయాలయ్యాయి, గాయాల పాలైన వారిని 108 వాహనంలో చీరాల వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్ సీపీ నాయకుడికి గాయాలు



వెంకట్రావును పరామర్శిస్తున్న రవిచందు, భాగ్యారావు తదితరులు

మార్టూరు: ద్రోణాదుల గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు పోపూరి వెంకట్రావు ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. వెంకట్రావు సమీప గ్రామమైన నాగండ్ల నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామం ద్రోణాదుల ఆదివారం వేకు జామున వస్తున్నాడు. మార్గమధ్యంలో బైక్ అదుపుతప్పటంతో వెంకటరావు బైక్‌తో సహా రోడ్డు పక్కనున్న పొలాల్లోకి దూసుకువెళ్ళాడు. ప్రమాదంలో వెంకట్రావు తల పొలంలో ఉన్న బావిని బలంగా ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులు గుంటూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నాయకులు గర్నె పూడి రవి చందు, ద్రోణాదుల సర్పంచ్ వంకాయలపాటి భాగ్య రావు, కత్తి అంజిబాబు సోమవారం ఆసుపత్రికి వెళ్లి వెంకటరావును పరామర్శించారు. ఇదిలా ఉండగా ఆయన కుటుంబ ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న ఇంకొల్లు మండల వైఎస్సార్ సీపీ నాయకుడు భవనం శ్రీనివాస్ రెడ్డి 5000 రూపాయల ఆర్థిక సహాయం అందించారు.

నాణ్యమైన విద్యుత్ అందించడమే ధ్యేయం



బల్లికురవ సబ్ స్టేషన్‌లో ప్రత్యేక లైన్ ప్రారంభిస్తున్న ఈఈ

బల్లికురవ: పరిశ్రమలకు, వ్యవసాయానికి, గృహాలకు నాణ్యమైన విద్యుత్ తో పాటు సరఫరాలో అంతరాయం లేకుండా చేసేందుకు ప్రత్యేక లైన్‌లు.. వీసీబీ ఏర్పాటు చేసినట్లు ఆ శాఖ ఈఈ మస్తాన్‌రావు తెలిపారు. సోమవారం బల్లికురవ సబ్ స్టేషన్‌లో ఇటీవల సుమారు రూ.30 లక్షలతో గంగమ్మ గుడివరకు 4 కిలోమీటర్లు పరిశ్రమలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన లైన్‌ను, వీసీబీని ఈఈ ప్రారంభించారు. చెన్నుపల్లి ఫీడర్‌కు కూడా ప్రత్యేక లైన్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. డీఈ ఎన్. సురేంద్రబాబు, ఏఈ కె. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాదిగల ఆత్మీయ సమావేశం



మాదిగల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు

చీరాల రూరల్: ఎస్సీ వర్గీకరణ ద్వారానే మాదిగల సమగ్ర అభివృద్ధి సాధ్యపడుతుందని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు, ఏపీ లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు అన్నారు. సోమవారం వాడరేవు రోడ్డులోని ఫారెస్టు పార్కులో ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ మాదిగల ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఎంఎస్‌పీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు బుడంగుంట్ల లక్ష్మీనరసయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మున్నంగి నాగరాజు, పిల్లి మాణిక్యరావు హాజరై మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందాకృష్ణ మాదిగ 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటాల ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ కల నెరవేరినట్లు చెప్పారు. ఎస్సీల్లో ఉన్న అసమానతలను తొలగించేందుకు ఏర్పడిన ఎమ్మార్పీఎస్ ఉద్యమం కాల క్రమేణా అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూర్చేందుకు సామాజిక ఉద్యమాలు చేపట్టిందని చెప్పారు. జిల్లా అధ్యక్షుడు దుడ్డు వందనం, ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు వంగిపురపు రమేష్, తేళ్ల రమేష్, మున్నంగి నాగేశ్వరరావు, గొర్పెపాటి రవి, బొంత అంకయ్య, పిడతల అభిషేక్, తేళ్ల రాంబాబు, తేళ్ల వీరశేఖర్, దుడ్డు విజయ్‌సుందర్, విజయనగర్ కాలనీ, ఐక్యనగర్, విఠల్‌నగర్, రామ్‌నగర్, నోవాహుపేట, వేటపాలెం నుంచి పలువురు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయుడికి లక్ష తమలపాకుల పూజ



లక్ష తమలపాకుల పూజలో ప్రసన్నాంజనేయ స్వామి

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామికి సోమవారం వైశాఖ పూర్ణిమ సందర్భంగా లక్ష తమలపాకుల పూజ నిర్వహించారు. ఉదయం సుప్రభాతం, బిందెతీర్థం, స్వామివారికి అభిషేకం అనంతరం అలంకరణ చేపట్టారు. 11 ఆవృత్తాలుగా దేవస్థానం వేదపండితులు అర్చకులు లక్ష తమలపాకులతో పూజ నిర్వహించారు. స్వామివారి పంచహారతులు ఇచ్చారు.

మారుతీ భవన్‌కు వితరణ



నగదు అందజేస్తున్న దాతలు

అద్దంకి రూరల్: మండలంలోని ప్రముఖపుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థాన వసతి గృహం మారుతి భవన్‌కు సామగ్రి వితరణగా వచ్చింది. ఏసీ,గీజర్, మంచాన్ని అద్దంకికి చెందిన కన్నెబోయిన బాలవీరయ్య, అనంత లక్ష్మి సోమవారం దేవస్థాన ఏసీ తిమ్మనాయుడుకు అవసరమైన నగదు సోమవారం అందజేశారు.

గ్రామ దేవతలను కొలవడం సంప్రదాయం



నాగార్పమ్మకు పూజలు చేస్తున్న హనిమి రెడ్డి

బల్లికురవ: గ్రామాల్లో ప్రజలు, పాడిపంటలతో సుభిక్షంగా ఉండేందుకు గ్రామదేవతలను కొలవడం మంచి సంప్రదాయమని అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పాలెం చినహనిమిరెడ్డి అన్నారు. ఎస్ఎల్ గుడిపాడులో మూబోయిన ఇలవేల్పుగార్పమ్మ కొలుపులు సోమవారంతో ముగిశాయి. మండల పార్టీ కన్వీనర్ దేవినేని కృష్ణబాబు, గ్రామ సర్పంచ్ పసల అంజలి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు ధ్వజస్తంభ గ్రామోత్సవం

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయ దేవస్థానంలో ప్రతిష్ఠించనున్న ధ్వజ స్తంభానికి మంగళవారం సాయంత్రం అద్దంకి లోని పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించనున్నారు. ఈమేరకు దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు సోమవారం తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో తక్కువ పెట్టుబడులు



ఆదర్శ రైతులను సత్కరిస్తున్న వ్యవసాయ శాఖాధికారులు

ఇంకొల్లు (చినగంజాం): రైతులు ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా సాగు ఖర్చులు తగ్గుతాయని పర్చూరు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎస్. మోహనరావు సూచించారు. మండలంలోని ఇడుపులపాడు పంచాయతీ కార్యాలయం ఆవరణలో సోమవారం ప్రకృతి వ్యవసాయ ప్రాధాన్యత గురించి, నవధాన్యాల సాగు గురించి రైతులకు వివరించేందుకు గ్రామ సభ నిర్వహించారు. వ్యవసాయ శాఖ, వెలుగు, ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏడీఏ మోహనరావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేద్దాం రైతులకు వ్యవసాయ ఖర్చు తగ్గిద్దాం అని రైతులకు తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయం వలన కలిగే లాభాలు రసాయని పదార్థాలతో చేసే వ్యవసాయం వలన కలిగే అనర్థాలు గురించి వివరించారు. రైతులంతా వ్యవసాయ భూమినంతటినీ ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి పంటలు పండించాలని తెలియజేశారు. ఇలా పండించిన ఆహార పదార్థాలు తినడం వలన కుటుంబ సభ్యులందరూ ఆరోగ్యంగా ఉంటారని తెలియజేశారు. మండల వ్యవసాయాధికారి వేణుగోపాల్ మాట్లాడుతూ నవధాన్యాల సాగుతో పంటకు కావాల్సిన పోషకాలు అందుతాయని తెలిపారు. ఎస్ఎఫ్ఏ మార్కెటింగ్ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించిన పంటలకు మార్కెటింగ్ సర్టిఫికేషన్ ఇస్తామని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు సీహెచ్ సుబ్బారావు, బి. జక్రయ్య, కె. సులోచన, సీహెచ్ శ్రీకాంత్, కె. రాంబాబు, టి. అంజయ్య, ఏ. శ్రీనివాసరావులను సన్మానం చేశారు. పంచాయతీ సర్పంచ్ బండారు సుమతి, గ్రామ పెద్దలు పేర్ని బాపయ్య, ఎంటీ వెంకటేశ్వర్లు, ఎల్ 2 వెంకటస్వామి, ఐసీఆర్‌పీలు, వెలుగు సిబ్బంది, వీఏఏ, ఏపీ సీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణ క్రతువులో అర్చకులు

యద్దనపూడి: మండలంలోని అనంతవరం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీరుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలుని కల్యాణం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రతి ఏడాది వైశాఖ శుద్ధ చతుర్దశి నాడు స్వామివారి కల్యాణం జరిపించటం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా స్వామివారిని సువర్ణ, రజిత, పసిడి ఆభరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి, సుమంగళ వాయిద్యాలు, వేదమంత్రాల నడుమ కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కల్యాణ క్రతువును అర్చకులు నారాయణం శ్రీనివాసాచార్యులు, డీహెచ్ఎమ్ ప్రసాద్, యాజ్ఞికులు ప్రవీణాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కల్యాణన్ని పురస్కరించుకొని స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు, కంకణాలను దేవాదాయధర్మదాయశాఖ అధికారులు స్వామివారికి సమర్పించారు. అనంతరం కల్యాణం అనంతరం తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు.

మండప నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

అద్దంకి: శ్రీశింగరకొండ ప్రసన్నాంజనేయ రాతి ముఖ మండప నిర్మాణానికి దాతలు చేయూతనిస్తున్నారు. సోమవారం నేరెళ్ల సుబ్బారావు జ్ఞాపకార్థం ఆయన ధర్మపత్ని అలంకారలక్ష్మి, కుమారులు వెంకట శేషగిరి, శ్రీనివాసరావు, కుమార్తెలు చుండూరు వెంకట సుజాత, వాడకట్టు శశికళ రూ.1,01,116 ఏసీ తిమ్మనాయుడికి అందజేశారు.

ఉత్సాహంగా ట్రాక్టర్ రివర్స్ డ్రైవింగ్ పోటీలు



ట్రాక్టర్ రివర్స్ చేస్తున్న పోటీదారుడు

చినగంజాం: మండలంలోని కడవకుదురు గ్రామంలో గ్రామ దేవత పోలేరమ్మ తిరునాళ్ల పురస్కరించుకొని సోమవారం ఆలయ ప్రాంగణంలో ట్రాక్టర్ రివర్స్ పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి మౌలాలి రూ 5116, రెండో బహుమతి గాజుల జగదీష్ రూ. 3116లు, మూడో బహుమతి కేసన బాజీ రూ. 2116 సాధించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, ప్రజలు పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మీ నరసింహునికి వెండి కలశం వితరణ



దాతలు అందజేసిన వెండి కలశం

అద్దంకి: జిల్లాలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ శింగరకొండ లక్ష్మీ నరసింహ స్వామికి కోనంకి గ్రామానికి చెందిన ఉప్పలపాటి శారద సుబ్బారావు వెండి కలశం, చెంబును అర్చకుల ద్వారా సోమవారం జూనియర్ అసిస్టెంట్‌కు అందజేశారు. వాటి విలువ రూ.22,500 ఉంటుందని దాతలు తెలిపారు. దాతలకు స్వామివారి పేరిట అర్చన చేసి తీర్థ ప్రసాదాలను అర్చకులు అందజేశారు.

శిడి మహోత్సవానికి లగ్నపత్రిక



అమ్మవారి తాంబూలం అందుకుంటున్న మీసాల శ్రీనివాసరావు

చినగంజాం: వేటపాలెం మండలం రావూరిపేట గ్రామ శివారులో వేంచేసియున్న సంతరావూరు కనక నాగవరపమ్మ శిడి మహోత్సవానికి ముహూర్తం ఖరారు చేస్తూ లగ్న పత్రికను సిద్ధం చేశారు. చినగంజాం మండలం సంతరావూరు గ్రామంలోని అమ్మవారి గిలకల మందిరం వద్ద సోమవారం శిడిమహోత్సవానికి లగ్న పత్రికను పండితులు తయారు చేశారు. అమ్మవారి తిరునాళ్ల జూన్ 2వ తేదీ నుంచి మొదలుకొని 10వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించే విధంగా, చివరి రోజు జూన్ 10వ తేదీ మంగళవారం సాయంత్రం కనక నాగవరపమ్మ శిడి మహోత్సవం నిర్వహించే విధంగా ముహూర్తాన్ని ఖరారు చేశారు. ఇందులో భాగంగా కనక నాగవరపమ్మ గుడి ఎగ్జిక్యూటివ్ అధికారి పోతిన శ్రీనివాసరావు నుంచి ప్రథమ తాంబూలం మీసాల శ్రీనివాసరావుకు అందజేశారు. గ్రామ పెద్దలు కొల్లా వెంకట సుబ్బారావు చౌదరి, యార్లగడ్డ లక్ష్మి, గ్రామ పెద్దలు, అమ్మవారి భక్తులు, ఆచార వంతులు పాల్గొన్నారు.